అతనికి గురువారానికల్లా ఉద్యోగం వచ్చింది. తన జీతంలోని పది శాతం అయిన వంద రూపాయలని అతను నెల నెలా ఆ దేవుడి గుడి హుండీలో వేయసాగాడు.

అతని జీతం పెరిగినప్పుడల్లా, హుండీలో వేసే డబ్బుని కూడా పెంచసాగాడు. చివరకి ఓ నెల అయిదు వందల రూపాయలు వేసాడు. కాని కొద్ది రోజుల తర్వాత అతను హడావిడిగా అర్చకుడి దగ్గరకి వచ్చి అడిగాడు.

"నేను దేవుడికి ఇచ్చిన మాటలోంచి బయట పడటం ఎలా?"

"ఎందుకని?" అడిగాడు అర్చకుడు.

"నాకు చాలా పెద్ద ప్రమోషన్ వచ్చి జీతం ఇప్పుడు నెలకి లక్ష రూపాయలైంది. నేను వందో రెండు వందలో అయితే వేయగలను కాని, చూస్తూ చూస్తూ పది వేలు తెచ్చి వేయలేను కదా?"

"నీ సమస్యకి పరిష్కారం చూపించమని దేవుడినే వేడుకో." సలహా ఇచ్చాడు అర్చకుడు.

అతను దేవుడ్ని అర్చకుడు చెప్పినట్లుగా ప్రార్థించి వెళ్ళాడు. మర్నాడు అతనికి ఉద్యోగంలో డిమోషన్ వచ్చింది. నెలకి వెయ్యి రూపాయలు జీతం వచ్చే పూర్వపు పోస్ట్‌లో తిరిగి చేరాడు.

## 15. దేవుడు ఎక్కడుంటాడు?

ఒకతనికి భగవంతుడు ఎలా వుంటాడో చూడాలన్న కోరిక కలిగింది. అతను అనేక మంది సాధువులని, సత్పురుషులని తనకి దేవుడ్ని చూపించమని కోరాడు. వాళ్ళంతా అది తమకి సాధ్యం కాదని నిరాకరించారు.

తమ వూరి బయట వనంలో ఓ జ్ఞాని వచ్చి బస చేసాడని తెలుసుకున్న అతను వెంటనే ఆయన దగ్గరకి వెళ్ళి వినమ్రంగా నమస్కరిస్తూ అడిగాడు.

"స్వామీ! నాకు మీరు భగవంతుడ్ని చూపించగలరా?"

"అంతటా వున్న భగవంతుడ్ని చూడకుండా ఎలా వుండ గలుగుతున్నావు?" వెంటనే అడిగాడాయన.

"నా కంటికి ఇంతదాకా దేవుడనేవాడు కనబడలేదు. ఇక్కడెక్కడైనా వుంటే ఆయన్ని దయచేసి చూపించండి." అర్థించాడు అతను.

వెంటనే ఆయన తలెత్తి ఆకాశంలోని నల్లటి దట్టమయిన మబ్బుల వంక చూపించి చెప్పాడు.

"అదిగో దేవుడు."

"అవి మబ్బులు. దేవుడెలా అవుతాయి?" ప్రశ్నించాడు ఆ జిజ్ఞాసి.

"ఎక్కడో వందల మైళ్ళ దూరంలో వున్న సముద్రం లోని నీటిని, ఎలాంటి సాధనం లేకుండా పైకి తీసి, ఎలాంటి వాహనం లేకుండా ఆ నీటిని ఇక్కడికి మోసుకువచ్చి, వర్ష రూపంలో ఇక్కడ కురిపించేది ఆయనే కాబట్టి ఆ మేఘాలు ఆయనే. మట్టిలో పాతి నీరు పోసినంత మాత్రాన, ఎలాంటి శబ్ద కాలుష్యం లేకుండా నిశ్శబ్దంగా ఏ విత్తనానికి ఆ ఫలాన్ని అందించేది ఆ దేవుడే కాబట్టి అదంతా కూడా దేవుడే. ఈ సృష్టిలో ఎక్కడ చూసినా కనబడేది ఆయన విభూదే, ఆయన శక్తే." వివరించాడు ఆ జ్ఞాని.

## 16. ముళ్ళ పొదలు

ఓ నగరంలోని ఉన్నత ప్రభుత్వాధికారి ఓ అడవిలోని ఓ సాధువుని చూడటానికి గుర్రం మీద బయలుదేరాడు. ఆ సాధువు ఆశ్రమ ప్రాంతం చేరుకున్నాక ముళ్ళచెట్లని కొట్టేసి దారిని చేసే ఓ పనివాడు ఆ అధికారికి కనిపించాడు. ఆగి అతన్ని ఆ సాధువు ఆశ్రమం ఇంకా ఎంత దూరంలో వుందని ప్రశ్నించాడు. పనిలో వున్న అ పనివాడు జవాబు చెప్పకపోవడంతో కోపం వచ్చిన ఆ అధికారి అతన్ని చర్నాకోలతో కొట్టాడు. తనని ఎందుకు కొడుతున్నాడో అర్థం కాక ఆ పనివాడు మిన్నకున్నాడు.

ఆశ్రమానికి చేరుకున్నాక ఆ సాధువు శిష్యుల ద్వారా ఆ పనివాడు సాధువేనని, ఆయన తను వచ్చిన మార్గంలో ముళ్ళచెట్లని కొట్టి దారి చేసే పనిలో వున్నాడని తెలియగానే, తను చేసిన పనికి పశ్చాత్తాప పడుతూ తిరిగి గుర్రం మీద సాధువు దగ్గరకి చేరుకున్నాడు. ఆయన కాళ్ళ మీద పడి తెలియక